
# మెరుపుల బ్రతుకులు

## సి.హెచ్.వి. బృందావనరావు




"ఎయ్‌ర సిన్నొదెయ్‌రా, ఎయ్ రా నీ సోకుమాడ" అంటూ రికార్డు పాడుతున్నది. ప్రభమీద కట్టిన చిన్న స్టేజి మీద జమున రికార్డుకు అనుగుణంగా గెంతుతున్నది. ప్రభ ఎలక్ట్రికల్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. ప్రభ బండి చుట్టూ గుంపుగూడిన జనం నోళ్ళు తెరుచుకుని కళ్ళార్పకుండా జమున వంకే తదేకంగా తమకంగా చూస్తున్నారు. కుర్రజనం, నోట్లో వేలు మడిచిపెట్టి ఈలలు వేస్తున్నారు. జనం ఈలలు వేసి గోల చేసే కొద్దీ జమున తన శరీరాన్ని వివిధ సెక్సీ భంగిమల్లో ఊపుతూ కుర్రకారును కిర్రెత్తిస్తున్నది.

ఆ రోజు శివరాత్రి. శివరాత్రికి చుట్టు పక్కల ఊళ్ల వాండ్లు ప్రభలు కట్టి కొండమీది దేవుడి దగ్గరికి తీసుకురావడం ఆనవాయితీ. ఎవరి ప్రభ ఎత్తుగా వుంది, ఎవరి ప్రభకు అలంకారం బాగా చేశారు అని జనం అనుకునేట్లు పోటాపోటీలుగా ప్రభలు కడతారు. పేరుకే దేవుడి పండగ. పూజా పునస్కారాలకన్నా ప్రభల సందడే ముఖ్యం తిరునాళ్ళంటే. నర్సరావుపేట నుంచో, రాజమండ్రి నుంచో రికార్డు డాన్సర్లను రప్పించి

రాత్రంతా ప్రభమీద డాన్సులు చేయించడమే అసలు ఆకర్షణ ప్రభలకు.

రాత్రి ఒంటిగంటయింది. పాట అయిపోగానే జమున వెనక్కు జరిగింది. వెంటనే మరో రికార్డు ప్రారంభం. శివకుమారి ముందుకు వచ్చి డాన్సు మొదలుపెట్టింది.

"ఇప్పటికింకా నా వయసూ నిండా పదహారే
చీటికి మాటికి చెయ్యేస్తూ చుట్టూ కుర్రాళ్లే"

అంటూ పాట మొదలుకాగానే శివకుమారి చెలరేగిపోతున్నది. కుర్రాళ్లు ఒకటే ఈలలు. కుర్రాళ్లేమిటి, వయసూ ముసలి లేకుండా అందరూ హుషారుగా నవ్వుతున్నారు. ఆడవాండ్లు కూడా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ డాన్సు చూస్తున్నారు.

డాన్సు చేసి జమున ఇవతలికి రాగానే, వెంకట్రావు వచ్చాడు ఆమె దగ్గరికి,

"వొళ్ళంతా కర్రల్తో కుమ్మతున్నట్లున్నది" అంది జమున వొళ్లు విరుచుకుంటూ. ఓ చిన్న సీసా అందించాడు వెంకట్రావు. 'తాగు, వొళ్లునెప్పులని పించవు' అన్నాడు.

"ఎందుకనిపించవు. ఇప్పుడేమైంది. రేపుంటుంది నా పని. రాత్తిరంతా ఎగరాల్సిందే గదా" అంది జమున.

ప్రభబండిమీద చిన్న స్టేజిలాంటిది కడతారు. ఆ కొంచెం చోట్లో చాలామంది ఇరుక్కుని కూచుంటారు. ఆ కొద్ది చోట్లోనే డాన్సు చెయ్యాల. ఒకరి డాన్సయిపోయి ఇంకొకరు ఎక్కగానే దిగిన వాండ్లు ఆ పక్కనే సర్దుకోవడమో, బండి దిగి ఓ నిమిషం నిలబడ్డమో! ఆడవాండ్లకు కొద్దిపాటి మరుగుకూడా వుండదు. చూసేవాండ్లకు హుషారే. చేసేవాండ్లకు నరకమే.

"ఇంతకూ పిల్లకెట్లుందో" అంది జమున వెంకట్రావుతో. "సాయంత్రం డాక్టర్‌కాడికి దీస్క పొమ్మని మీ అమ్మకు చెప్పినాంగదా. సత్తిగాణ్ణి తోడు దీసుకొని పొయ్యుంటదిలే. తెల్లారంగానే పోతాం గదా" అన్నాడు వెంకట్రావు.

"ఇప్పుడో మంచి భక్తిరసం పాటకు డాన్సేస్తది చూడండి" అని డాన్సర్ల పక్క నిల్చుని అనౌన్సు చేసేవాడు చెప్పాడు నవ్వుతూ. జనమంతా నవ్వారు వాడి జోకుకు. వాండ్లకు తెలుసు భక్తిరసం పాటంటే ఏందో.

శివకుమారి, కింద నిల్చున్న జమునతో అంది ప్రభమీది నుంచి "నువ్వేస్తవా అక్కా" అని. "ఈపాలి నువ్వెయ్యవే" అంది జమున. ఆర్గనైజరు రికార్డు పెట్టాడు. శివకుమారి ఎగరటానికి సన్నద్ధమైంది.

"ఓరోరి యోగి నన్ను నలిపెయ్‌రో, నన్ను కొరికెయ్‌రో" అని పాట మొదలైంది. భక్తిరసం పాటంటే వెంటనే అర్థం గాని వాండ్లు పాట రాగానే నవ్వారు. శివకుమారి వొళ్లంతా కదిలిస్తూ, ముఖంలో సెక్సీ భావాలు పలికిస్తూ డాన్సు చేస్తున్నది. జనం ఈలలు వేస్తున్నారు.

✿ ✿ ✿

తొలికోడి కూసే వేళకు జనం బాగా పలచబడ్డారు. డాన్సు ప్రోగ్రాం అయిపోగానే తిరిగి వాండ్ల వూరికి పోవడానికి వేన్ దగ్గరికి చేరారు డాన్సర్లు. రాత్రంతా ఎగిరెగిరి, నిద్రలేమితో, అలసటతో వాండ్ల మొహాలన్నీ పీక్కుపోయి వున్నాయి. తమను బుక్ చేసుకొని వచ్చిన ఆర్గనైజర్ను పట్టుకొని తమకు రావల్సిన మిగతా డబ్బును అడుక్కొంటున్నాడు వెంకట్రావు వేన్‌కు కొంచెం దూరంలో. ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చి "ఇయ్యాల మన ప్రభే పస్టు. డాన్సులు అద్దిరిపోయినయిపో" అన్నాడు ఆర్గనైజరు.

"యంకట్రావు ట్రూపంటే ఏందనుకున్నావ్ మరి" అన్నాడు వెంకట్రావు.

"ఎల్లుండి ఓ ఫంక్షనుంది మా వూళ్లో. రికార్డింగు డాన్సులుపెడదామను కుంటున్నం. మీరే రావాల" అన్నాడు ఆర్గనైజరు.

"మీరెట్ల చెబితే అట్లనే" అన్నాడు వెంకట్రావు.

"రేపొచ్చి మీకు అడ్వాన్సు ఇస్తా" అన్నాడు ఆర్గనైజరు. వేన్‌లో జమునా, శివకుమారీ, వెంకట్రావూ, శివకుమారి భర్తా, ఇంకో ఇద్దరు ఇరుక్కొని కూచున్నారు. వేన్ బయలుదేరింది. "ఎల్లుండి వాండ్లూళ్లో ఏదో ఫంక్షనుందంట. ఆరోజు డాన్సు చేయాలన్నాడు రెడ్డి" అన్నాడు వెంకట్రావు.

"అప్పుడేనా. ఈ రాత్తిరి జేసిందానికి వొళ్లు నొప్పులు తగ్గాలంటే వారమైనా పడద్ది. నా చాతకాదు బాబూ" అంది శివకుమారి. "పిల్లకెట్లుందో అని నేను ఇదౌతా వుంటే అప్పుడే ఇంకోటి బుక్‌జేసుకొచ్చినవా. నువ్వు మనిషివేనా" అంది జమున.

"ఏం బుక్కయినా ఈ సీజనులోనే గదా. ఈ రికార్డింగు డాన్సులు సమ్మచ్చరం పొడుగుతా వుంటాయా. కష్టమో, సుఖమో ఓ రూపాయి సీజన్లోనే సంపాదించుకోకపోతే ఎట్టా" అన్నాడు శివకుమారి భర్త.

"మీకేం బాగానే సెపతరు. ఒక్కరాత్తిరి బండిమీద ఎగరండి తెలస్తది" అంది శివకుమారి.

జమునకు మాత్రం ఇంటిదగ్గర జ్వరంతో బాధపడుతున్న తన రెండేళ్ళ కూతురే కండ్లలో మెదుల్తున్నది.

"నువ్వేం ఇదిగాబాకక్కా. పిల్లకు తగ్గుం టదిలే. సత్తిగాడు డాక్టరుకాడికి తీస్కపోతనన్నడుగా" అని అనునయించింది శివకుమారి.

ఉదయం తొమ్మిదికల్లా ఇల్లు చేరారందరూ. దిగగానే ఉరుకుల పరుగులతో ఇంట్లోకి పోయింది జమున. ఆమె వెనకే శివకుమారి.

వెంకట్రావూ, శివకుమారి భర్తా డబ్బులు పంచుకుంటున్నారు. "ఒళ్ళు కాలిపోతున్నదే. జరం ఏమీ తగ్గినట్టు లేదు" అంది జమున, మంచంమీద కూచుని, పిల్లనుదిటిపై చెయ్యేసి చూసి "డాక్టరు కాడికి తీసకపోలేదా" పక్కనే వున్న తల్లినడిగింది. "ఏదీ ఆ సత్తిగాడొచ్చి చస్తేగా" అంది ముసలామె.

"మరి ఏం మాత్తరేసినవు" అడిగింది జమున. "ఏమీ ఎయ్యలా" అంది ముసలామె. వెంకట్రావు ఇంట్లోకి వచ్చాడు.

"పిల్లకు వారం రోజులబట్టీ బాగాలేక పోయె. అదీ తగ్గుద్దిలే అని వూరుకుంటిమి. రాత్తిరి నించీ మోపు జేసె. మనమేమో ఎగర్డానికి బోతిమి. ఇయ్యాలన్నా డాక్టర్ కాడికి దీస్కపోవాలె" అంది జమున.

"నేనొస్తనక్కా" అని శివకుమారి, భర్తతో కలిసి ఇంటికి బయల్దేరింది.

స్నానాలవీ చేసి వెంకట్రావూ, జమునా పిల్లను తీసుకొని డాక్టరు దగ్గరకి పోయినారు. అయిదారు రకాల టెస్టులు రాశాడు డాక్టరు. అవన్నీ చేయించారు. రిపోర్టులు మర్నాడు గాని రావు.

"రిపోర్టులన్నీ తీసుకొని రేపు రండి. అందాకా ఈ మాత్రలు పూటకొకటి, పాలల్లో కలిపి తాగించండి" అన్నాడు డాక్టరు. టెస్టులన్నీ చేయించి, డాక్టర్ను కలిసి ఇంటికొచ్చేసరికి మూడైంది. పిల్లకు మాత్ర వేసి, తాము పండుకున్నారు వెంకట్రావూ, జమునా.

సాయంత్రం ఐదుగంటలకు రెడ్డి వచ్చాడు. "రేపు రాత్రికే మా వూళ్లో ఫంక్షను. రికార్డింగ్ డాన్సుకు జమునా, శివకుమారీ రావాలి. ఇదిగో అడ్వాన్సు" అన్నాడు.

"సరే" అని అడ్వాన్సు తీసుకోబోయాడు వెంకట్రావు. జమున లోపల్నించి వచ్చి "వొద్దు బాబూ, మా పిల్లకు జ్వరంగా వుంది. రేపు మళ్లీ డాక్టరు దగ్గరికి పోవాల. నేను రాలేను. ఇంకెవరినైనా బుక్ చేసుకోండి" అంది.

"మాకు మీరే గావాల. ఒక్కరాత్రే గదా. తెల్లారే సరికి వస్తారాయె. మీకుండే పేరు యవరి కుంది. మీరొస్తున్నారంటే జనం ఇరగబడతారు" అన్నాడు రెడ్డి.

"సరేలేన్నా. నువ్వింతగా జప్పాల్నా" అని అడ్వాన్సు తీసుకున్నాడు వెంకట్రావు.

"నీకేమన్నా మతి గాని పోయిందా ఏం. పిల్లదానికట్టా వుంటే దిగులుపడతా డాన్సెట్టా జయ్యాల" అంది జమున.

"ఒక్క రాత్రే గదా. ఏం గాదులే ఒప్పుకో"

అన్నాడు రెడ్డి లేచి. ఆరుగంటలకల్లా అక్కడుండాలె. సరేనా" అని వెళ్లిపొయ్యాడు.

"నువ్వూరికే ఇది గామాక. రేపొద్దున్నే డాక్టరు దగ్గరికి పొయ్యి రిపోర్టులయ్యా జూపించి. మందుల్దీసుకుందాం. మీ అమ్మ టైం ప్రకారం మందులేస్తా వుంటది. మనం తెల్లారేసరికి వద్దాం. సత్తిగాణ్ణి తోడుంచి పోదాం" అన్నాడు వెంకట్రావు.

"వాణ్ణి నమ్ముకుంటే అయినట్టే" అంది జమున.

"ఒప్పుకోక్కా. ఏం జేద్దాం మరి. మనకిదే గదా ఆధారం. ముద్ద కడుపులోకి బోవాలగదా" అంది అప్పుడే వచ్చిన శివకుమారి.

"ఏం మొగుళ్ళా. పెళ్ళాన్ని నడీదిలో గెంతిపించి డబ్బులు సంపాయిస్తున్నారు. మొగుళ్లంట, మొగుళ్ళు" అని లోపలికి పోయింది జమున కండ్లల్లో తడి మెరుస్తుండగా.

✿ ✿ ✿

పొద్దున్నే ఆస్పత్రికి పొయ్యాడు వెంకట్రావు. టెస్టు రిపోర్టులన్నీ లాబ్ నుంచి తీసుకొని డాక్టర్ను కలిసే సరికి పన్నెండైంది. రిపోర్టులన్నీ చూసి, "జాగ్రత్తగా ఉండాలయ్యా. రాత్రంతా పిల్లను కనిపెట్టుకుని వుండండి. ఏమన్నా ఇబ్బంది అయితే వెంటనే ఆస్పత్రికి తీసుకురండి. మందులు మాత్రం మూడు గంటలకోసారి పోయండి" అన్నాడు డాక్టరు.

దిగులుగా ఇంటికొచ్చాడు వెంకట్రావు.

"డాక్టరేం జెప్పినాడు" అడిగింది జమున.

"నాల్రోజుల్లో తగ్గుతుందని చెప్పినాడు. మందులు రాసిచ్చినాడు. తెచ్చినా" అన్నాడు వెంకట్రావు.

"వేన్ వస్తుంది. తయారుకా" అన్నాడు నాలుగ్గంటలకు.

"పిల్లకు అట్టుండె. ఏం బోతం. ఇంకెవర్నైనా బంపరాదా" అంది జమున.

"ఆ రెడ్డి సామాన్యమైనోడు గాదు. ఇంటిమీదికొచ్చి తన్నినా తంతాడు. అడ్వాన్సు తీసుకొంటిమాయ. నీకెందుకు, తెల్లారేసరికి వస్తాంగదా. ఎట్టానో ఈ ఒక్కపూట సర్దుకో" అన్నాడు వెంకట్రావు. ముసలామెకు చెప్పాల్సిన జాగ్రత్తలన్నీ చెప్పి మందు లెప్పుడెయ్యాల్నో వివరించి, వ్యాన్లో బయల్దేరారు వెంకట్రావూ, జమునా, శివకుమారీ, ఆమె భర్తా, మరి ఇద్దరు మనుషులూ –

పల్లెకు చేరేసరికి ఎనిమిదైంది. ఆలస్య మైందని అగ్గిమీద గుగ్గిలమౌతున్న రెడ్డి వీండ్లను చూడగానే కొంచెం శాంతించాడు. ఊరిమధ్య రచ్చబండ దగ్గర ఓ స్టేజీ వేయించారు. జమునా, శివకుమారీ ట్రూప్ అనగానే వూరంతా చేరింది. పదకొండు గంటలకు రికార్డింగ్ డాన్సు ప్రోగ్రాం మొదలయింది.

రికార్డులు మోగుతున్నాయి. జమునా, శివకుమారీ ఒకరి తర్వాత ఒకరు చెలరేగి ఆడుతున్నారు. జనం ఈలలు వేస్తూ చప్పట్లు చరుస్తూ ఆనందిస్తున్నారు.

తెల్లవారిందాకా ఎగిరెగిరి ఒళ్లు హూనం చేసుకుని నీరసపడిపోయినారు డాన్సర్లు ఇద్దరూ. వెంకట్రావూ, శివకుమారి భర్తా, రెడ్డిగారి అనుచరు లిద్దరితో కలిసి ఫుల్లుగా తాగి, తూలుతూ, స్టేజివెనుక కూలబడ్డారు. మొత్తానికి ఫంక్షన్ అయిపోయింది.

తెల్లవారు జామున, చీకటి వుండగానే అందరూ బయల్దేరారు. ఇంటికి వచ్చేసరికి ఎనిమిదైంది. ఇంటిముందు చిన్న గుంపు. ఇరుగు పొరుగులంతా చేరి వున్నారు. వేన్ ఇంటిముందు ఆగగానే దిగి ఒక్క ఉదుటున లోపలికి పోయింది జమున.

"పో తల్లీ. రాత్తిరి రెండుగంటలప్పుడు పిల్ల పక్కమీద ఎగిరెగిరి పడిందే. ఏందో చూద్దామని చూసేసరికి వొళ్లంతా కాలిపోతున్నట్టుండె. మందు తీసకొచ్చే తలికే, అంతా అయిపోయిందే. నేనేం జేతునే తల్లీ" అని ముసలామె జమునను కరుచుకొని ఏడవడం మొదలుపెట్టింది. జమున విదిలించుకొని పిల్ల మంచం దగ్గరికి పోయి, కూతురు శవం మీద పడిపోయింది నిశ్చేష్టురాలై.

## స్మృతి పథం

చానాళ్ళకు చిక్కిన కొద్దిపాటి తీరిక
పెండింగ్ పనులెంత వెంటాడినా
ఉబ్బితబ్బిబ్బైన మనసు
చిన్నప్పటి ఆల్బాన్ని ముందేసుకుంది
కాలాన్ని వెనక్కి తిప్పే సత్తా లేకే కదా !
ఈ పాతఫోటోలు పచ్చల హారాలవుతున్నాయి.
ఏడో తరగతిలో ఎక్స్‌కర్షన్ ట్రిప్పు
ఓ పాతిక సంవత్సరాలు వెనక్కి...
మసకబారిన ముఖాలని పదిలంగా తుడిచా
గడచిన గుర్తులూ గతస్మృతులూ
రీళ్ళకు రీళ్ళుగా కదులుతున్నాయి.
నాగార్జునసాగర్ కళ్ళముందు ప్రవహిస్తోంది.
అదీ జవహర్ ఎడమకాలువ పచ్చటి పార్కులు పంటచేన్లూ
ఔను ! ఇది నేనే. బుగ్గచేతుల గౌను రెండుజెళ్ళ రిబ్బన్లు
ఇంతలో ఎంత మార్పు !
కాలానికింతటి వేగమెందుకో !?
పక్కన చెల్లి, ఆ పక్కన స్నేహమయిరమ
అరే ! తను మధు కదూ !
పదో తరగతికే నూరేళ్ళూ నింపుకొని వెళ్ళిపోయాడు.
మిగిలిన మిత్రులు పై వరుసన
అప్పటి వీళ్ళంతా ఇప్పుడెక్కడో ! ఏం చేస్తున్నరో ?
మా గురుదేవులు నా కెప్పటికీ ఉన్నత హిమశిఖరాలే
ఛాయా చిత్రపటాలు నిశ్చల సాక్ష్యాలకు మచ్చుతునకలేనా !?
జ్ఞాపకాల రెపరెపలతో ఓలలాడించే సీతాకోకచిలుకలు కూడా
మరణించకుండా స్మృతులను పదిలపరుచుకునేవి
నేనెప్పటికీ అపురూపంగా దాచుకునే నెమలీకలు ఈ ఫోటోలు.

**– నాంపల్లి సుజాత**